# సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025




సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన జనం



మంగ్లీ గీతాలాపన

## రథసప్తమి వేడుక

### ఆదిత్యుడే.. స్వర్ణాభరణభూషితుడై..

**అరసవల్లి:** వెలుగుల రేడు.. బంగారపు తొడుతో నేడు దర్శనమివ్వనున్నారు. రథ సప్తమి పుణ్య ఘడియల్లో స్వామి నిజరూపాన్ని చూసి భక్తజనం తరిస్తారు. ఆనక స్వామి వారిని సంపూర్ణంగా నగలతో అలంకరిస్తారు. స్వర్ణాభరణ భూషితుడైన స్వామిని చూసేందుకు రెండు కళ్లు చాలవు. అలంకరణకు ఆభరణాలను కూడా సిద్ధం చేశారు.

- మొత్తం 39 రకాల మూర్తుల కవచ ఆభరణాలతో పాటు స్వామి మూలవిరాట్టు చుట్టూ మకరతోరణంగా 3 కిలోల 361 గ్రాముల బంగారంతో మకరతోరణం ఉంది.
- అధికారిక వివరాల మేరకు ఆలయానికి మొత్తం 17 కిలోల 256 గ్రాముల బంగారం, 531 కిలోల 600 గ్రాముల వెండి ఆభరణాలున్నట్లు రికార్డుల్లో నమోదయ్యాయి.

**మూలవిరాట్టుకు 39 రకాలతో పాటు మకర తోరణ స్వర్ణాభరణాలివే...**



| | |
|---|---|
| ఛత్రం | కీర్తి ముఖం |
| కిరీటం | ఇరువైపుల కేయూరాలు |
| సనక మహర్షి కవచం (ఎడమ వైపున) | |
| సనంద మహర్షి కవచం (కుడి వైపున) | |
| రెండు నేత్రాలు | బొట్టు |
| మీసాలు | ఇరువైపుల కర్ణపత్రాలు |
| ఇరువైపులా తామర పద్మాలు, | |
| రెండేసి తామర మొగ్గలు కవచం | |
| ఇరువైపుల హస్తాలు | |
| సువర్ణ ఆభరణం (అలంకరణ కోసం) | |
| ఇరువైపుల వాణీ చెంగులు | |
| పింగళుడి కవచం (ఎడమ వైపు ద్వారపాలకుడు) | |
| మాఠల కవచం (కుడివైపు ద్వారపాలకుడు) | |
| రెండు పాదాలు | ఛాయా దేవి (పాదాల క్రింద) |
| పద్మినీ దేవి కవచం (ఎడమ వైపు) | |
| ఉషా దేవి కవచం (కుడి వైపు) | |
| అనూరుడు (రథసారధి) | |
| ఏడు గుర్రాలు (సప్తాశ్వాలు) | |

**మకరతోరణంలో భాగాలివే (పై నుంచి కిందకు)**



- మధ్యలో కీర్తిముఖం,
- ఇరువైపులా చిలుకల తోరణాలు,
- ఇరువైపులా మకర పక్షులు,
- ఇరువైపులా మూలస్తంభాలు
- చెరోవైపున జయవిజయుల మూర్తులు ఉన్నాయి.

### బంగారు రథ సప్తమి



**కాశీబుగ్గ:** పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ సూక్ష్మ రథసప్తమి బంగారులోగోని తయారు చేశారు. 100 మిల్లీగ్రాములు బంగారాన్ని ఉపయోగించి ఎత్తు ఒక సెంటీమీటర్ వెడల్పు ఒక సెంటీమీటర్‌గా తయారు చేయడానికి సుమారు రెండు గంటల సమయం పట్టినట్లుగా తెలియజేశారు.



# ఆదిదేవా నమస్తుభ్యం

- అర్ధరాత్రి 12.20 తర్వాత ప్రారంభమైన ఆదిత్యుని క్షీరాభిషేకం
- తరలివచ్చిన భక్తజనం
- ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ కాంతులు

**అరసవల్లి:**

రథ సప్తమి వేడుక అరసవల్లి వేదికగా అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటాక సప్తమి ఘడియల్లో స్వామి వారి మూలవిరాట్టుపై పంచామృతాల అభిషేకం జరిగింది. రాష్ట్ర పండుగగా తొలిసారిగా రథసప్తమి మహోత్సవాలను నిర్వహిస్తున్న సందర్భంగా ఆలయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పవిత్ర క్రతువులో దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వి.వినయ్‌చంద్ పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసి రావు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఈఓ వై.భద్రాజీ తదితరులతో ఆలయ పునర్నిర్మాత దివంగత వరుదు బాబ్జీరావు కుటుంబసభ్యులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కుటుంబసభ్యులు స్వామి అభిషేక తొలిపూజల్లో పాల్గొన్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలోనే అర్చక స్వాముల వేదమంత్రోచ్ఛరణలు, మంగళధ్వనుల మధ్య శాస్త్రోక్తంగా అభిషేక సేవ ప్రారంభించిన అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట నుంచే సర్వదర్శనాలకు అనుమతించారు. ఉదయం 7 గంటల వరకు అభిషేక సేవ జరుగగా.. అనంతరం అపురూపమైన నిజరూపంలో ఆదిత్యుడు దర్శనమిచ్చారు.

**తరలివచ్చిన భక్తజనం**

రథసప్తమి నాడు స్వామి వారి నిజరూప దర్శనంతో పాటు అభిషేకాదిత్యుడిని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి సైతం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సాధారణ భక్తులు, రూ.100 దర్శనాల మార్గాలు నగరం వైపు నుంచి అలాగే గార వైపు నుంచి కూడా వచ్చేలా ఏర్పాటు చేయడంతో కొంతవరకు వెసలుబాటు కలిగింది. అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు భక్తుల రద్దీ కొనసాగుతూ ఉంది. ఇక దాతల పాసులున్నవారు, అభిషేక టిక్కెట్లు కొనుగోలుదారులు రెండు వేర్వేరు లైన్లలో దర్శనాలకు వెళ్లగా..అర్ధరాత్రి ఒంటి గంట నుంచి మంగళవారం వేకువజామున 7 గంటల వరకు ఈ దర్శనాలకు కొనసాగించారు.

అనంతరం ఈ దర్శనమార్గాల్లో స్లాటెడ్ దర్శనాలు (రూ.300) ప్రారంభించారు. అలాగే స్థానిక మున్సిపల్ హైస్కూల్ రోడ్డు నుంచి సాధారణ (ఉచిత) దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. వేకువ జామున మంచు ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ భక్తుల రద్దీ మాత్రం తగ్గలేదు.



పాలభాస్కర వైభవం (ఫైల్)

**అర్ధరాత్రి జరిగిన సూర్యోదయానికి** అరసవల్లి సాక్షిగా నిలిచింది. అరుణ శిలపై జాలువారిన క్షీరధారలతో ఆదిత్య క్షేత్రం పునీతమైంది. నగరమంతా వెలుగులీనిన విద్యుత్ కాంతులతో చీకటికి చోటు లేకుండాపోయింది. సూర్యక్షేత్రం వేదికగా రథ సప్తమి వేడుక అంబరాన్నంటింది. రాత్రి నుంచే భక్తులు బారులు తీరి కనిపించారు. దాతలకు పాసులు ఇవ్వకుండా.. అవే పాసులు ఇతరులకు ఇవ్వడం, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా అంతగా నిబంధనలు పట్టించుకోకపోవడం వంటివి కూడా జనం కంట పడ్డాయి.

**ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ కాంతులు**

ఈ సారి రథసప్తమి ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ కాంతులు నిలిచాయి. అరసవల్లి మిల్లు కూడలి నుంచి అసిరితల్లి అమ్మవారి ఆలయం వరకు అద్భుతంగా విద్యుత్ పందిళ్లు, స్తంభాలకు లైటింగ్ బోర్డులు ఆకట్టుకున్నాయి. అలాగే ఇప్పటికే సెంటర్ అట్రాక్షన్‌గా నిలిచిన మిల్లు కూడలిలో సూర్యరథచక్రం, ఏడు గుర్రాలతో ఆదిత్యుని మూర్తి, గ్రీనరీ ప్లాట్‌ఫారాలతో పాటు సూర్యనమస్కారాల భంగిమలు భక్తులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**దర్శించుకున్న ప్రముఖులు**

ఆదిత్యున్ని దర్శించుకునేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ప్రముఖులు తరలివచ్చారు. దాత హోదాలో ఆలయానికి వచ్చిన ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని ఆర్చిగేటు వద్ద ఆపేశారు. కాసేపు అక్కడ ఆమె కూర్చుని వేచి చూశాక లోపలకు పంపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ కొందరికి ప్రొటోకాల్ సిబ్బంది ద్వారా దర్శనాలకు అవకాశాలివ్వడం వివాదాస్పదమైంది. అలాగే డోనర్ పాసులు ఇవ్వడానికి అధికారులు ఒప్పుకోలేదు. కానీ వాటితో పాటు వీఐపీ పాసులు కూడా అంతే పెద్ద ఎత్తున వెళ్లాయి. అదెలా జరిగిందో అధికారులకే తెలియాలి.

## సాంస్కృతిక సందడి

రథసప్తమి వేడుకల్లో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలస్యంగా ఆరంభమయ్యాయి. నరసన్నపేటకు చెందిన శాంతారం బృందం బుర్రకథ ఆకట్టుకుంది. బుర్రకథలో తమ ఆవేదనను హాస్యాన్ని జోడిస్తూ చెప్పేశారు. మొదటి రోజున వీఐపీలకు ప్రవేశానికి రూట్ ఒక రకంగా పెట్టారు. రెండో రోజు వేరో రూట్ నుంచి రావాలని పోలీసులు హడావుడి చేశారు. దీంతో అక్కడ ప్రేక్షకులు ఇబ్బందులు పడ్డారు.

**ఇవే ప్రదర్శనలు..**

నిర్వాహకులు ఇచ్చిన టైం ప్రకారం సాయంత్రం 5గంటలకు సుందరంపల్లి శ్రీనివాస్ శాక్సాఫోన్ కచేరి ప్రారంభం కావాల్సి ఉండగా 7గంటలకు మొదలైంది. అనంతరం నరసన్నపేటకు చెందిన శాంతారాం బృందం బుర్రకథ, మావుదూరు సత్యనారాయణ శర్మ వాయులీన కచేరి, నీరజా సుబ్రహ్మణ్యం క్లాసికల్ నృత్య ప్రదర్శన, రఘుపాత్రుని శ్రీకాంత్ యోగా డ్యాన్సు ప్రదర్శన, సంప్రదాయం కూచిపూడి గురుకులం క్లాసికల్ డ్యాన్సు, అనంతరం లేజర్ షో, ప్రముఖ సినీగాయని మంగ్లీ బృందం సినీమ్యూజిక్ ప్రదర్శన చక్కగా సాగింది.

శ్రీకాకుళం కల్చరల్



మావుదూరు సత్యనారాయణ శర్మ వయొలిన్ విన్యాసం



నీరజా సుబ్రహ్మణ్యం బృందం నాట్య ప్రదర్శన



## 5 వరకు హెలికాప్టర్ రైడ్

రథ సప్తమి వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్‌ను 5వ తేదీ వరకు పొడిగించినట్లు డ్వామా పీడీ బి.సుధాకర్ తెలిపారు. చాలా మందికి హెలికాప్టర్ రైడ్ కొత్త అనుభూతిని అందించిందని, ఈ ఏడాది వేడుకల్లో ఈ రైడ్ ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. –శ్రీకాకుళం

## మిగిలిన దాతల పాసులు ఎవరికో..?

**అరసవల్లి:** అరసవల్లికి ఎంతో మంది దాతలు నగదు విరాళాలు ఇచ్చారు. వీరికి రథ సప్తమి వేళ ప్రత్యేక దర్శనాలు కల్పించి గౌరవిస్తూ వచ్చారు. అయితే ఈ సారి మాత్రం కొత్త ఆంక్షలు అమల్లోకి తెచ్చి.. చాలా వరకు పాసుల జారీ విషయంలో కోత విధించారు. రూ.4 లక్షలిచ్చిన దాతకు కేవలం రెండు పాసులు ఇవ్వడం వంటి నిర్ణయాలను అమలు చేయడంతో దాతలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో కొందరు దాతలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ తమ పాసులను సైతం తీసుకెళ్లలేదు. అరసవల్లి ఆలయానికి ఇంతవరకు 1260 వరకు దాతలు రూ.లక్ష అంతకుమించిన విరాళాలు ఇచ్చారు. ఇందులో సుమారు 500 వరకు పాసులు తాజా నిబంధనల కారణంగా మిగిలిపోయాయని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఈ మిగిలిన పాసులను ఏం చేస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇలా మిగిలిన సందర్భాలు చాలా తక్కువ. కీలక ప్రజాప్రతినిధులు దాతల పాసులపై దృష్టి పెట్టడం వెనుక అసలు మతలబు ఏంటో గానీ దాతలు మాత్రం అవస్థలు పడుతున్నారు. ఇదిలావుంటే మిగిలిన పాసులన్నీ రికార్డు చేయాలని, అలాగే ఇచ్చిన పాసుల వివరాలన్నీ రికార్డు చేయాలని దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించినట్లుగా చెబుతున్నప్పటికీ దాతల మనసులో మాత్రం అనుమానాలు అలాగే ఉన్నాయి.



అర్ధరాత్రి వేళ క్యూలోనే నిద్రపోతున్న భక్తులు



రాత్రి ఆలయ క్యూలో వేచి ఉన్న భక్తులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్



ఆలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌చంద్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్









ఆలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

## క్లుప్తంగా

### బాడీ బిల్డింగ్ పోటీలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పట్టణంలో ఈనెల 9వ తేదీన జరగనున్న 30వ రాష్ట్రస్థాయి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని మంత్రి కె.అచ్చెన్నాయుడు కోరారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నిమ్మాడలోని తన క్యాంప్ ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వరసగా జిల్లాలో పదిసార్లు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన ఏపీ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్, అతని బృందాన్ని కొనియాడారు. ఫిబ్రవరి 9వ తేదీన శ్రీకాకుళం పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతం అయ్యేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ పోటీల్లో గెలిపొందిన విజేతలకు రూ.1,25000ల నగదు బహుమతి, ట్రోఫీ అందజేస్తామని వడ్డాది విజయ్‌కుమార్, బలగ ప్రసాద్ వెల్లడిచేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ మెంబర్ కె.ప్రసాద్, ఇప్పిలి తిరుమలరావు, నేషనల్ రిఫరీ బి.సూరిబాబు, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



టెక్నో విజన్ సదస్సు ప్రారంభిస్తున్న సీఎస్ఐ చైర్మన్, కార్యదర్శి సుధాకర్, రమణ తదితరులు

టెక్కలి: ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (హైదరాబాద్) చైర్మన్ సీహెచ్ సుధాకర్ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టెక్నో విజన్ సదస్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యం కలిగిన వారికి ఏ కంపెనీ అయినా ఖచ్చితంగా ఉద్యోగం ఇస్తుందని చెప్పారు. మానవ మేధస్సుకు సాంకేతికత మరింత తోడుగా నిలిస్తే అద్భుతమైన విజయాలు సాధించవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరూ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, నూతన ఆవిష్కరణలు మరింత అభివృద్ధి చేయాలని సీఎస్ఐ కార్యదర్శి డి.వి.రమణ సూచించారు. ప్రతీ కళాశాల కొన్ని గ్రామాలను దత్తత తీసుకుని, అక్కడ సమస్యలను సాంకేతికంగా పరిష్కరించాలని కోరారు. విద్యార్థులు సొంతంగా ఆలోచనలు చేసి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు, అకడమిక్ డీన్ బి.వి.రమణ, సీఎస్ఈ హెచ్‌ఓడీ వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## క్రీడా సంబురం..

# ఆద్యంతం రసవత్తరం

- ముగిసిన రథ సప్తమి క్రీడాపోటీలు
- కోలాహలంగా సాగిన కర్రసాము, సంగిడి, ఉలవ బస్తాల క్రీడలు
- ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్, గ్రామీణ క్రీడల పోటీలు
- హోరాహోరీగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోరు



హోరాహోరీగా సాగుతున్న వాలీబాల్ ఫైనల్ పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: రథసప్తమి క్రీడా పోరు ముగిసింది. అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఉత్సవాలను పురస్కరించుకుని రెండు రోజులపాటు జిల్లా కేంద్రంలో కన్నులపండువగా సాగిన క్రీడాపోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయిలో వాలీబాల్, జిల్లాస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్, వివిధ గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించారు. ఒక్క వాలీబాల్ పోటీలు మినహా మిగిలిన అన్ని క్రీడలు ఆదివారం రాత్రితోనే ముగిశాయి.

**ఆకట్టుకున్న గ్రామీణ క్రీడలు**

రథసప్తమి క్రీడా పోటీల్లో భాగంగా ముఖ్యంగా గ్రామీణ క్రీడలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కర్రసాము, ఇసురుగుండు, ఉలవ బస్తాలు, తీట సంగడి, ఈడువు సంగడిల లిఫ్టింగులు, పిల్లి మొగ్గలు వంటి గ్రామీణ క్రీడలు ఆహుతులను అలరించాయి. పోటీలను చూసేందుకు వచ్చిన యువత, విద్యార్థులు, సందర్శకులతో మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. విజేతలకు అధికారులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు, పి.సుందరరావు, ఎం.సాంబమూర్తి, ఏఆర్ డీఎస్పీ అప్పన్న, శ్రీనివాసరావు, వాలీబాల్ సంఘ ప్రతినిధులు, డీఎస్ఏ కోచ్‌లు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

**వెయిట్ లిఫ్టింగ్**

పురుషుల విభాగంలో ఆవల గోవిందరావు(నిమ్మాడ)160 కేజీల విభాగం, ముద్దాడ తరుణ్ (తంగివాణిపేట) 140 కేజీల విభాగం, గుజ్జల ట్వింకిల్‌కుమార్ (ఆడవరం) 135 కేజీల విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందుకున్నారు.

☛ మహిళా విభాగంలో గుజ్జల వర్షిత(ఆడవరం) 95 కేజీల విభాగం, దూబ హేమశ్రీ(బూరవల్లి) 90 కేజీల విభాగం, సీహెచ్ హారికారాజ్ (కొర్లకోట) 50 కేజీల విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.



గ్రామీణ పోటీల్లో రాణించి నగదు బహుమతి అందుకుంటున్న క్రీడాకారుడు



వాలీబాల్ పోటీలను తిలకిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు

వాలీబాల్ విజేత విజయనగరం జట్టు



**వాలీబాల్**

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. విజయనగరంతో జరిగిన తుది సమరంలో ఆతిథ్య శ్రీకాకుళం జట్టు 2–1 సెట్ల తేడాతో ఓటమిపాలైంది. దీంతో విజయనగరం జట్టు విజేతగా నిలవగా, ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా రన్నరప్‌గా నిలిచింది. తృతీయ స్థానంలో కృష్ణా జిల్లా నిలిచింది. ఈ జిల్లాల జట్లు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేల నగదు బహుమతులు, మొమెంటోలు అందుకున్నాయి. వాలీబాల్ పోటీలను తిలకించేందుకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ ఉండడంతో ఎమ్మెల్యే వెనుదిరిగారు.



వాలీబాల్ రన్నరప్ టీమ్ శ్రీకాకుళం జట్టు

**గ్రామీణ క్రీడలు**

- **కర్రసాము**

☛ పురుషుల విభాగంలో కె.యుగంధర్ (నరసన్నపేట), సీహెచ్ రాంరేవంత్ (నరసన్నపేట), ఆర్.నరేంద్రనాయుడు (శ్రీకాకుళం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

☛ మహిళా విభాగం సాహితీ సౌమ్య (శ్రీకాకుళం), బి.శ్రీకళా (శ్రీకాకుళం), తన్మయి(శ్రీకాకుళం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

- **ఇసురు గుండు**

గేదెల సత్యనారాయణ (వప్పంగి), గేదెల రమణ (వప్పంగి), ముద్దాడ వెంకటేష్ (తమ్మినాయుడుపేట) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

- **పిల్లి మొగ్గలు**

ఎస్.సురేష్ (పెద్దపాడు), ఎస్.జగదీష్ (పెద్దపాడు), సత్తిబాబు (నరసన్నపేట) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

- **ఉలవల బస్తా 160 కేజీలు**

ఆవల గోవిందరావు (నిమ్మాడ), గేదెల సత్యనారాయణ (వప్పంగి), సావల వసంతరావు (చిట్టివాణిపేట) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

- **ఈడువు సంగిడి**

ఆవల గోవిందరావు (నిమ్మాడ), గేదెల సత్యనారాయణ (వప్పంగి), ఆవల వసంతరావు (చిట్టివాణిపేట) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

- **తీట సంగిడి**

గేదెల సత్యనారాయణ (వప్పంగి), గేదెల రమణ (వప్పంగి), ముద్దాడ వెంకటేష్ (తమ్మినాయుడుపేట) మొదటి మూడు స్థానాల్లో నిలిచి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందుకున్నారు.

## ఘనంగా వసంత పంచమి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు దేవాలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు సోమవారం నిర్వహించారు. వసంత పంచమి పురస్కరించుకొని సరస్వతీ దేవి పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు అక్షరాలు దిద్దించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపించారు. నానుబాలవీధిలోని విజయదుర్గ ఆలయంలో అర్చకులు ఆరవెల్లి ఫణిశర్మ, సూర్యనారాయణ శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి హోమం జరిగింది. అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించారు. 1,008 కలశాలు అమ్మవారి ముందు ఉంచి పూజలు చేశారు. అదేవిధంగా నగరంలోని పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో సైతం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. అర్చకులు చామర్తి శ్రీనివాసాచార్యులు, ఆలయ ట్రస్టు చైర్మన్ పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో దూరప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుమారుడు రామ్‌మనోహర్‌నాయుడు కుమారుడికి కూడా అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో బంటుపల్లి కృష్ణశర్మ, జాడ రాఘవాచారి, పి.శ్రీకాంత్, శ్రీదేవి, కల్యాణచక్రవర్తి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీదేవి అలంకరణలో విజయదుర్గ



పీఎన్‌కాలనీ వరసిద్ధి వినాయక పంచాయతన ఆలయంలో అక్షరాభ్యాసాలు

## ఇంటికి వస్తూ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మృతి

- రెండు రోజుల క్రితమే పదవీ విరమణ



మృతి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వెంకటరమణ (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట గ్రామానికి చెందిన కాగితాపల్లి వెంకటరమణ (44) సికింద్రాబాద్ ఆర్మీ ప్రధాన కార్యాలయం (ఏవోసీ)లో పనిచేస్తూ జనవరి 31వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈనెల 2వ తేదీ ఆదివారం తన స్వగ్రామం బొర్రంపేట వచ్చేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అయితే రైలు కోసం వేచి ఉన్న వెంకటరమణ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోగా గుండెనొప్పితో మృతి చెందాడు. పదవీ విరమణ చేసిన రెండు రోజుల్లోనే తమ కళ్లముందే కుప్ప కూలి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి ఇద్దరు కుమార్తులు ఉన్నారు. వెంకటరమణ మృతితో బొర్రంపేట గ్రామంలో విషాదం అలముకుంది.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్‌కి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

ఇచ్ఛాపురం/కంచిలి/వజ్రపుకొత్తూరు/సోంపేట: జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వివిధ రైల్వే స్టేషన్లలో ఆయన సోమవారం పర్యటించారు. ఇచ్ఛాపురంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మిలు కలిసి రత్తకన్న రోడ్‌లోని ఎల్‌సీ గేట్ సమీపంలో అండర్‌పాస్, పాతాళ సిద్దేశ్వరాలయం వద్ద నిర్మించిన జగనన్న కాలనీకి వెళ్లేమార్గంలో రైల్వే అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రైలు నిలయంలో అదనంగా మరికొన్ని ముఖ్యమైన రైళ్ల నిలుపుదల చేయాలన్నారు. అదేవిధంగా వివిధ స్టేషన్లలో ప్రజాప్రతినిధులు కలిసి వినతిపత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాళ్ల ధర్మారావు, బుద్దాల నిర్మల, జి.సాయి కామేష్, జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు శ్రీనివాస్ రౌలో, బచ్చు జగన్, సల్లా దేవరాజు, రైల్ యూజర్ కమిటీ సభ్యులు అనపాన దొరబాబు, బత్తుల తిరుమల, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుమ్మిడి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## 15న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సభ

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 15న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమానికి శ్రీకాకుళం నుంచి శ్రీకారం చుడుతున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య సమర ఉద్యమంలో సాగిన గ్రంథాలయ ఉద్యమం మరోసారి ప్రభుత్వాల నిర్వాకాల వలన అవసరమైందని మేధావివర్గం అభిప్రాయపడింది.

దీనికోసం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం పేరుతో రాష్ట్ర స్థాయిలో ఒక కార్యాచరణ ప్రణాళికను జనవరి 9న విజయవాడలో జరిగిన సమావేశంలో ఖరారు చేశారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి స్థానిక సంస్థలు, పరిశ్రమలకు గ్రంథాలయ సెస్ పేరుతో చెల్లిస్తున్న డబ్బును రాష్ట్ర ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయని, గ్రంథాలయ వ్యవస్థ దాదాపు నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉన్న బకాయిలు రూ.కోట్లలో కనిపిస్తున్నాయని తెలిపారు. గ్రంథాలయాల సెస్‌ను గ్రంథాలయ సంస్థల అభివృద్ధికి వినియోగించాలని, కొత్త పుస్తకాలు కొనుగోలు, ముద్రణను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. శాఖా గ్రంథాలయాల మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించాలన్నారు. శ్రీకాకుళం నుంచి ప్రారంభమవుతున్న ఈ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమానికి పాఠకులు, మేధావి వర్గం ప్రతినిధులు, సాహితీ సంస్థల అండదండలు ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

### ● గో కల్యాణం



కన్యాదానం చేశారు.. జీలకర్ర బెల్లం పెట్టారు.. తాళి కట్టే తంతు కూడా జరిగింది. వధూవరులు మాత్రం గోవులు. కొత్తూరు మండలం దిమిలి గ్రామానికి చెందిన కొప్పల వైకుంఠరావు వెంకటలక్ష్మి దంపతులు తమ ఇంటిలో గో కల్యాణం నిర్వహించారు. లోక కల్యాణార్థం కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కల్యాణ క్రతువు అయ్యాక ఊరంతా భోజనాలు కూడా పెట్టారు. - కొత్తూరు

## ప్రశాంతంగా 'ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్' పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన తప్పనిసరి ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ఈనెల ఒకటో తేదీన నైతికత మరియు మానవతా విలువల (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష జరగగా.. సోమవారం పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్ష జరిగింది. ఈ రెండు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని 164 జూనియర్ కళాశాలల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ పరీక్షకు మొత్తం 20,241 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 19824 మంది పరీక్ష రాశారు. 417 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

- కారులో చెలరేగిన మంటలు
- సురక్షితంగా బయటపడిన ఐదుగురు



మంటల్లో దగ్ధమవుతున్న కారు

జలుమూరు: సురవరం పంచాయతీ పరిధి దొంపాక వద్ద ఆదివారం మధ్యాహ్నం కారులో మంటలు వ్యాపించి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నం మద్దిలపాలెంనకు చెందిన ఐదు కుటుంబాలు నాలుగు వాహనాల్లో సుమారు 20 మంది అరసవల్లి, శ్రీకూర్మాం పుణ్యక్షేత్రాలు దర్శించుకొని శ్రీముఖలింగం బయల్దేరారు. తిమడాం వద్ద కారు కింద భాగంలో అపరాలైన మినప పంట తొక్కు అడ్డు రావడంతో సుమారు కిలోమీటరు దూరం వరకు చిన్న మంటలు, పొగలు వ్యాపించాయి. కారు వెనకే వస్తున్న ఒక ఆటో డ్రైవర్ ఈ కారును వెంబడించి మంటలు చెలరేగుతున్నాయని హెచ్చరించారు. అలాగే దొంపాక వద్ద అక్కడ మినప పంట నూర్చుతున్న రైతులు కొందరు పెద్ద కేకలు వేసి కారు కిందభాగంలో మంటలు, దట్టమైన పొగ వస్తోందని అరిచారు. దీంతో ఏం జరుగుతోందని కారు నడుపుతున్న శోభారాణి కారును నిలుపుదల చేసింది. ఇంతలో దట్టమైన పొగలు, పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఏం చేయాలో తోచక ఒక్కసారిగా కారులో ఉన్న శ్రీనుబాబు, సోని, చంద్రిక, శ్యామ్‌లు బయటకు వచ్చారు.

**మినప తొక్కే ప్రమాదానికి కారణం**

ఇదిలా ఉండగా ఈ ప్రమాదం కారు కింద భాగంలో షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, మినప తొక్కు వల్ల జరిగిందా అనేది గుర్తించలేదు. దొంపాక వద్ద రైతులు రోడ్డు మీద పెట్టిన మంటలు వల్లే ఇలా జరిగిందని బాధితులు చెప్పారు. అయితే తిమడాం వద్ద మినప తొక్కు అడ్డం తగిలి రోడ్డుకు బలంగా ఈడ్చుకెళ్లడంతో పొగలు వ్యాపించి మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయని అక్కడ స్థానిక రైతులు, ఆటో డ్రైవర్ చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సుమారు గంటన్నర సమయం వరకూ దట్టమైన పొగలు, పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో కారు టైర్లు పెద్ద శబ్దాలతో పేలిపోయాయి. దీంతో కారులో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతయ్యిందని బాధితులు బోరున విలపించారు. ప్రమాదం జరిగిన వెంటనే నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావుకు వారు ఫోన్‌లో సమాచారం అందించారు. అలాగే అగ్నిమాపక కేంద్రం కోటబొమ్మాళి, నరసన్నపేట చేయగా వారు వేరే చోట అగ్ని ప్రమాదం ఆర్పే ప్రయత్నంలో ఉన్నామన్నారు. దీంతో టెక్కలి నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను నిలుపుదల చేశారు.

## ఆటో బోల్తా

- డ్రైవర్ మృతి





బోల్తాపడిన ఆటో (ఇన్‌సెట్లో) మృతుడు మోహన మురళీ (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని నడగాం–శివరాంపురం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై సోమవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో చెన్నాపురం పంచాయతీ శివారు గ్రామం మొయ్యివానిపేటకు చెందిన మొయ్యి మోహన మురళి(45) మృతి చెందారు. రైల్వే కూలీలను ఆటోపై తరలించి ఇంటికి వచ్చి, తిలారులో ఆటో స్టెఫినీ టైర్ మరిచిపోపోవడంతో తీసుకొని రావడానికి రాత్రి 10 గంటల సమయంలో వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా నడగాం–శివరాంపురంల మధ్య పోలాకి గెడ్డ వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాలు పాలైన అతను అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి ఒంటి గంట సమయానికి భర్త ఇంటికి రాకపోవడంతో భార్య భాగ్యలక్ష్మి ఫోన్ చేసింది. దగ్గర్లో ఉన్నా.. వచ్చేస్తా అని చెప్పారని రాత్రింతా రాకపోవడంతో ఆందోళనతో గ్రామస్తులు రోడ్డుపై గాలించగా పోలాకి గెడ్డ వద్ద మృతిచెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. వెంటనే నరసన్నపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ అసిరినాయుడు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఉదయానికి ఎవరో మోహన మురళీని హత్య చేశారని పుకార్లు వచ్చాయి. పోలీసులు వచ్చి పరిశీలించిన తర్వాత సెల్ఫ్ ప్రమాదంగా నిర్ధారించారు. మంచు ప్రభావం కారణంతో వేగంగా వస్తూ అక్కడ ఉన్న మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడిందని భావిస్తున్నారు. మురళీ మోహన్ భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## రాందాసుపురంలో చోరీ

పొందూరు: మండలంలో కనిమెట్ట పంచాయతీ రాందాసుపురం గ్రామంలోని పైడి వెంకటసత్యవతి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ప్రతీరోజు మాదిరిగానే ఇంటికి తాళం వేసి ఇంటి స్లేడ్‌పై తాళంచెవి పెట్టి వ్యవసాయ పనులకు వెళ్లిపోయామని, సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో నగదు, బంగారం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఘటనలో రూ.76 వేల నగదు, తులంపావు బంగారం చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. నిత్యం ఇంటికి తాళం వేసి అక్కడే పెట్టడం గమనించిన వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఎస్ఐ సత్యనారాయణ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.